డిప్యూటేషన్‌లో డాక్టర్లు..
డిప్రెషన్‌లో రోగులు

- కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్యుల కొరత
- 45 పోస్టులకు గాను 24 మందే సిబ్బంది
- అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి

5



ఉపాధి హామీ పనులు భేష్



దాసర్లపల్లిలో ఫామ్‌పాండ్‌ను పరిశీలిస్తున్న బిహార్ ప్రజాప్రతినిధులు

» బిహార్ ప్రజాప్రతినిధుల కితాబు

కందుకూరు, మే30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చర్ల, దాసర్లపల్లి గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం బిహార్ రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో సరిత నేతృత్వంలో బిహార్‌కు 126మంది ప్రజాప్రతినిధులు ఫీల్డ్ విజిట్‌కు వచ్చారు. రెండు గ్రామాలలో ఫామ్‌పాండ్, శ్మశాన వాటిక, కంపోస్ట్ యార్డు, పల్లె ప్రకృతి వనం, గ్రామ పంచాయతీల భవన నిర్మాణం, ప్రాథమిక పాఠశాల, భవనాలు, ఉన్నత పాఠశాల భవనాలు. నర్సరీ, పౌల్ట్రీ షెడ్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో గీత, ఏపీడీ చరణ్, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ఫ్యాకల్టీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు లావణ్య, రమేష్, ఇంద్రసేన్, మహేష్, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

జనసేవాదళ్ ర్యాలీని విజయవంతం చేద్దాం

పాలమాకుల జంగయ్య

చేవెళ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : జనసేవాదళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ ముగింపు సందర్భంగా ఈనెల 31వ తేదీన చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్వహించనున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ... ఐదు రోజులుగా చేవెళ్లలో రాష్ట్రస్థాయి జనసేవాదళ్ కార్యకర్తలకు శిక్షణ తరగతులు జరుగుతున్నాయని చెప్పారు. వీటి ముగింపు సందర్భంగా భారీ ర్యాలీతో పాటు సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పానుగంటి పర్వతాలు, ఎం. ప్రభులింగం, రామస్వామి, మల్గాని సత్తిరెడ్డి, వడ్ల సత్యనారాయణచారి పాల్గొన్నారు.



మక్తల్ ఎమ్మెల్యే కారుకు ప్రమాదం

షాద్‌నగర్‌రూరల్, మే30(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కారు ప్రమాదానికి గురైంది. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్తుండగా రంగారెడ్డి జిల్లా పరిధిలోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద మరో కారు పక్క నుంచి వచ్చి ఎమ్మెల్యే కారును ఢీకొట్టింది. ఎమ్మెల్యే కారు ముందు భాగం కొంత దెబ్బతింది. అయితే ఈ విషయం గురించి ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌ను వివరణ కోరగా.. ప్రమాదం చిన్నది కావడం వల్ల కావచ్చు.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.



ఏరువాక

సాగారో..

పల్లెల్లో మొదలైన సాగు సందడి

నైరుతి రుతుపవనాలు ముందస్తు రావడంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పల్లెల్లో సాగు సందడి మొదలైంది. రైతన్నలు పొలం బాట పట్టారు. దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులు చల్లడం తదితర వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల విత్తనాలు విత్తడం మొదలెట్టారు. వ్యవసాయ అధికారులు కూడా రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. ఈసారి వరి పంటను సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

- వానలతో మొదలైన వ్యవసాయం
- పొలం పనుల్లో నిమగ్నమైన రైతన్నలు
- విత్తనాలు, ఎరువుల కోసం పరుగులు
- 3.47 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- వరి వైపే మొగ్గు చూపుతున్న అన్నదాత

రంగారెడ్డి అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందస్తుగా ప్రవేశించడంతో వానాకాలం సీజన్ మొదలైంది. ప్రతీరోజు వర్షాలు కురుస్తుండటంతో రైతన్నలు ముందస్తు సాగుకు సన్నద్ధమవుతున్నారు. విత్తనాలు విత్తేందుకు, వరినార్లు పోసేందుకు సిద్ధమయ్యారు. కొందరు రైతులు పొలాల్లో దుక్కులు దున్నుతుండగా.. మరికొందరు సేంద్రియ ఎరువు చల్లుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో గుంటుక తోలుతున్నారు. పత్తి విత్తనాలు విత్తుతున్నారు.

సాధారణం కంటే అధిక వర్షం

జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు రైతులు పరుగులు పెడుతున్నారు. ప్రతీ గ్రామంలో 60మిల్లీమీటర్ల వర్షం కురిస్తే విత్తనాలు వేయాల్సి ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. అయితే మే నెలలో సాధారణ వర్షపాతం 29.9మిల్లీమీటర్ల కాగా 105.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 75.9 మిల్లీమీటర్లు

మిగతా 6వ పేజీలో...

పొలంబాట పట్టాం..



చేవెళ్ల : ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురుస్తుండటంతో దుక్కులు దున్ని సిద్ధం చేశాం. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి కొంతమంది విత్తనాలు విత్తారు. మరికొన్ని వర్షాలు కురిస్తే విత్తనాలు వేసేందుకు మరింత అనువుగా ఉంటుంది. ప్రస్తుతం పొలం పనుల్లో నిమగ్నమయ్యాం.

- సీహెచ్. యాదయ్య, రైతు ఖానాపూర్, చేవెళ్ల మండలం

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 10కిలోల గంజాయి పట్టివేత

శంషాబాద్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తీసుకొస్తున్న 10కిలోల గంజాయిని పట్టుకున్న సంఘటన శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తాయ్ ఎయిర్‌లైన్స్ 329 విమానంలో శుక్రవారం తెల్లవారుజామున ఒక ప్రయాణికుడు బ్యాంకాక్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాడు. కస్టమ్స్ అధికారుల తనిఖీలో అతని బ్యాగులో 10 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పట్టుబడిన గంజాయిని సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈజీఎస్‌లో ఏడాదికి 200 రోజులు పని కల్పించాలి

ఫార్మాసిటీ రైతులకు పరిహారం చెల్లించాలి

- » సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్
- » కలెక్టరేట్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



కలెక్టరేట్‌లోకి దూసుకొస్తున్న నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

రంగారెడ్డి అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో సంవత్సరానికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద ర్యాలీ, ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మెయిన్ గేట్‌ను తోసుకుని కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.600 చెల్లించాలని, మున్సిపల్, పట్టణాలు, నగర పంచాయతీల్లో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 164 ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో

మిగతా 6వ పేజీలో...



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చల్లా వంశీచందర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో గ్రూపుల్లేవ్..

- » పారదర్శకంగా పదవులు .. స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి
- » సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి
- » కడ్తాల్‌లో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

ఆమనగల్లు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గడప గడపకూ వివరించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, టీపీసీసీ డీలిమిటేషన్ కమిటీ ఛైర్మన్ చల్లా వంశీచందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి పని చేసి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని సాధించుకున్న, నియోజకవర్గంలో ఎమ్మెల్యేను గెలిపించుకున్న విధంగా స్థానిక సంస్థల్లో మరింత ఉత్సాహం, పట్టుదలతో పనిచేసి అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం కడ్తాల్‌లోని ఎంబీఏ గార్డెన్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు, బ్లాక్ మండల కాంగ్రెస్ నూతన కమిటీల ఏర్పాటు, స్థానిక సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా రాహుల్‌గాంధీ ఆదేశానుసారం బ్లాక్ కాంగ్రెస్ మండల నూతన కమిటీలను పారదర్శకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పైరవీలకు చోటు లేకుండా పార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకు ప్రజాభిమానం, కష్టపడి పని చేసే తత్వం ఉన్నవారు, పదవిని బాధ్యతగా భావించి పనిచేసే వారికి పార్టీలో

మిగతా 6వ పేజీలో...

కలగానే కాలేజీ!

ఏళ్లుగా జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఎదురుచూపు

- చొరవ చూపని పాలకులు, అధికారులు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న కడ్తాల విద్యార్థులు
- విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేసినా స్పందన కరువు



కడ్తాల ముఖ చిత్రం

కడ్తాల్, మే30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కడ్తాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. ప్రజాప్రతినిధుల, నేతల హామీలు నీటి మీద రాతలయ్యాయి. కళాశాల ఏర్పాటు విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల అందుబాటులో లేని కారణంగా పేద విద్యార్థులు ఉన్నత విద్యకు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర రాజధానికి చేరువలో ఉండి, వ్యాపార పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న కడ్తాల మండలం విద్యారంగంలో పూర్తిగా వెనుకబడింది. జిల్లాల పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటులో భాగంగా కడ్తాలను తొమ్మిదేళ్ల క్రితం మండల కేంద్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొన్నేళ్ల నుంచి కళాశాల ఏర్పాటు గురించి విద్యార్థి సంఘాలు,

మిగతా 6వ పేజీలో...

దశాబ్ద కాలంగా పోరాటం



కడ్తాల మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు గురించి దశాబ్ద కాలంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాం. అయినా స్పందన లేదు. అందుబాటులో కళాశాల లేక పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. కళాశాల ఏర్పాటు కోసం పలు మార్లు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సైతం అందజేశాం. పాలక ప్రజాప్రతినిధులు కళాశాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి.

క్యామ శ్రీకాంత్, కడ్తాల్

నిర్వహణ లేక నిరుపయోగంగా..



ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధి ఎంపీ పటేల్‌గూడలోని అంజలి టౌన్ షిప్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారింది. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిర్వహణ లేక కొన్ని పరికరాలు తుప్పు పట్టగా, మరికొన్ని దొంగలపాలయ్యాయి. పరికరాలు పనిచేయక వ్యాయామం కోసం ఇక్కడికి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఓపెన్ జిమ్ నిర్వహణను పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదిభట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి)

చేవెళ్లలో ప్రజావైద్యశాల సీజ్

వ్యక్తి మృతిపై విచారణకు వచ్చిన వైద్యాధికారులు



ప్రజావైద్యశాల నర్సింగ్ హోంను సీజ్ చేస్తున్న వైద్యసిబ్బంది

చేవెళ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్లలో నిర్వహిస్తున్న ప్రజావైద్యశాల నర్సింగ్ హోంను జిల్లా వైద్యశాఖ అధికారులు సీజ్ చేశారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన 'అనుమతిలేని వైద్యం' కథనానికి వారు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రజావైద్యశాల నర్సింగ్ హోంను చేవెళ్ల డివిజన్ వైద్యబృందం సందర్శించింది. ప్రజావైద్యశాల నర్సింగ్ హోంలో ఆపరేషన్ చేసుకున్న కేసారం గ్రామానికి చెందిన కళ్లెంల నర్సింలు మృతి చెందడంపై విచారణ చేశారు. కాగా తనిఖీ సమయంలో ఆస్పత్రి మూసి ఉండడంతో పాటు నిర్వహకులకు వైద్యబృందం ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి వేంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ప్రజావైద్యశాల నర్సింగ్ హోంను సీజ్ చేశారు.



పేదల సొంతింటి కల సాకారం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి



ప్రొసీడింగ్ అందజేస్తున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, మే 30(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను ప్రభుత్వంసాకారం చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏర్పుమళ్ల గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేశారు. ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి ముగ్గు పోశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వినోద్‌గౌడ్, హౌసింగ్ డీఈ చందర్, ఏఈ వరుణ్, పీఏసీఎస్‌చైర్మన్ జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ

దుద్యాల: మండలంలోని సంద్రకుంట తండాలో రూ.41లక్షలతో పాఠశాల భవన నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, సీతారాంనాయక్, రవినాయక్, కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.



వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు

వంశీకి ఘన సన్మానం

కడ్తాల్, మే 30(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ డీలిమిటేషన్ కమిటీ చైర్మన్‌గా నియమితులైౖ కడ్తాల మండల కేంద్రానికి వచ్చిన కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, పార్టీ నేతలు వంశీచంద్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బీక్యనాయక్, బీచ్యనాయక్, చందోజీ, కృష్ణనాయక్, జగన్, జంగారెడ్డి, రామకృష్ణ, తులసీరామ్ నాయక్, పాలకుర్ల రాములు, ఫరీద్, వెంకటేశ్, లక్ష్మయ్య, కృష్ణ, శ్రీను, రవి, ఇమ్రాన్‌బాబా, రాజేందర్, నరేందర్, శేఖర్‌గౌడ్, అశోక్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా నిరంజన్‌రెడ్డి



ఆదిభట్ల, మే 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ, ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డిని నియమిస్తూ అధిష్ఠానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మర్రి నిరంజన్‌రెడ్డికి నియోజకవర్గ నాయకులు అభినందనలు తెలిపారు. అధిష్ఠానం తనపై నమ్మకంతో క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా నియమించినందుకు సంతోషంగా ఉందని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. పార్టీ బలోపేతానికి, క్రమశిక్షణకు అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రహదారి గుంతలమయం



కొడంగల్- తాండూర్ రోడ్డు మార్గం రైస్‌మిల్ సమీపంలో రోడ్డు ఇలా

కొడంగల్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 167-ఎన్) పనులు కొన్నినెలలుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కొడంగల్ నుంచి తాండూర్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ఒకవైపు జరుగుతుండగా మరోపక్క వైపు వాహనాలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కల్వర్టుల నిర్మాణాలు అసంపూర్తిగా నిర్మించారు. కొడంగల్ శివారులో రోడ్డు మధ్యలో నీరు నిలిచి పెద్దగుంతలు ఏర్పడడంతో భారీ వాహనాలు గుంతలను దాటుకుని ప్రయాణించాలంటే డ్రైవర్లు తలలు పట్టుకుంటున్నారు. వారం రోజులుగా కురిసిన వర్షాలకు కొడంగల్ శివారులో రోడ్డులో పెద్ద గుంత ఏర్పడడంతో ద్విచక్రవాహనదారులు ఒకరిద్దరు ప్రమాదానికి గురయ్యారు. చుట్టుపక్కల పొలాలకు వెళ్లేవారు ఒకరు చెట్టు కొమ్మలను పెట్టి రోడ్డుమధ్యలో ఏర్పడిన గుంత దగ్గర ఉంచడంతో వాహనదారులు పక్క నుంచి వెళ్తున్నారు.



దినసరి కార్మికులకు
వేతనాలు చెల్లించాలి

● వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విభాగాల్లో వేతన సవరణ కమిటీ పరిగణనను బట్టి దినసరి కార్మికులకు జీతభత్యాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగ వేతన స్థిరీకరణ(ఎన్‌ఎంఆర్)పై వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న హాజరు పట్టిక (ఎన్ఎంఆర్)లో లేని కార్మికులకు వేతన సవరణ కమిటీ సిఫారసు మేరకు కనీస వేతనాలను అందించాలన్నారు. నైపుణ్యం, నైపుణ్యంలేని పాక్షిక నైపుణ్యం కలిగిన దినసరి కార్మికులకు రెండు సంవత్సరాలకు ఒకసారి వేతనాల పెంపునకు అనుగుణంగా అందించాలన్నారు. గ్రామీణ, మునిసిపల్ పరిధిల్లో పనిచేసే కార్మికులకు కనీసవేతనాలు ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ వాల్యానాయక్, డీహెచ్ఎస్‌వో సత్తార్, డీఎంహెచ్‌వో వెంకటరవణ, విద్యుత్ శాఖ ఎస్ఐఈ రవి ప్రసాద్, డీబీసీడీవో ఉపేందర్ పాల్గొన్నారు.













ఆలయ నిర్మాణ శంకుస్థాపనలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

గ్రామాల అభివృద్ధికి కృషి

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, మే 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మంచాల మండల పరిధి బండలేమూర్‌లో రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, రూ.4లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ.50లక్షల నిధులతో నిర్మితమయ్యే శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వెళతామని చెప్పారు. మొదటి విడతలో మంజూరయ్యే ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులందరూ నిర్మాణాలు పూర్తిచేసుకోవాలన్నారు. విడతల వారీగా అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, మంగ శ్రీనివాస్, జంగయ్యయాదవ్, వెంకటేష్‌యాదవ్, మాజీ ఎంపీపీ జయమ్మ, ఎల్లేష్, ఎడమ నరేందర్‌రెడ్డి, మార సురేష్, మాసయ్యగౌడ్, రాజేష్, శేఖర్, మధుసూధన్‌రెడ్డి, ప్రేమాకర్‌రెడ్డి, వింజమూరి రాంరెడ్డి, బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, శివ, వెదిరె సికిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

వికారాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేటు రూ.600 చేయాలని, 200రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. తాండూరు బైపాస్ రోడ్డు బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, కొడంగల్ ప్రాంతంలో భూములు సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, సుదర్శన్, సతీష్ పాల్గొన్నారు.

కార్యకర్తలపై చేయివేస్తే ఊరుకునేది లేదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



మల్లేష్ పటేల్‌ను పరామర్శిస్తున్న రాజశేఖర్‌రెడ్డి తదితరులు

పూడూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలపై చేయివేస్తే ఊరుకునేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. భూతగాదాల నేపథ్యంలో బీజేపీ నాయకుడు పూడూరు మల్లేష్ పటేల్‌పై కేసు నమోదైన విషయం తెలుసుకున్న రాజశేఖర్‌రెడ్డి శనివారం పూడూరు మండల బీజేపీ అధ్యక్షుడు రాఘవేందర్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ నాయకులపై అధికార పార్టీ నాయకులు అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోమన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించకుండా ప్రజలకు న్యాయం చేయాలని, అధికార పార్టీకి వత్తాసు పలికితే పెద్దఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఆమనగల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. విత్తన డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఎరువుల, విత్తనాల దుకాణాలను సందర్శించి రికార్డులు, విత్తనాల, ఎరువుల నిల్వలను పరిశీలించారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాస్‌గౌడ్



పూజలో ఎమ్మెల్యే యాదయ్య

దైవచింతన కలిగి ఉండాలి

» చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దైవచింతన కలిగి ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని తంగడ్‌పల్లిలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి రాజగోపుర కలశ ప్రతిష్ఠ, స్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే యాదయ్య శ్రీ దశావతార సహిత శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవనామస్మరణతోనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. అర్చకులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సంఘం అధ్యక్షుడు ఖాజాపాష

రైతు కాలనీ రోడ్డును అభివృద్ధి చేయండి

షాద్‌నగర్, మే 30(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని రైతు కాలనీ రోడ్డును అభివృద్ధి పర్చాలని కాలనీ సంక్షేమం సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సంఘం అధ్యక్షుడు ఎండీ ఖాజాపాషా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కోటమైసమ్మ చారిత్రక దేవాలయంగా వెలసిన ఈ ప్రాంతంలో కాలనీ ప్రధాన రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పట్టణంలోని వెంకటేశ్వర, తిరుమల కాలనీలలో కూడా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టాలని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



కుర్మిద్ద ఉన్నత పాఠశాలకు చేరిన పాఠ్యపుస్తకాలు

యాచారం మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

యాచారం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలలకు శుక్రవారం 16,354 పాఠ్యపుస్తకాలు చేరాయి. మండలంలో 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 6 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, 31 ప్రైమరీ పాఠశాలలున్నాయి. ఈమేరకు పాఠశాలలు తెరవగానే పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో పాండురంగారెడ్డి తెలిపారు. బడిబాట కార్యక్రమం కూడా చేపడుతున్నామని ఆయన చెప్పారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

శంషాబాద్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు గణేశ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు అప్పగిస్తే అన్యాయం జరుగుతోందని, అలా చేస్తే పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజేందర్, రాములు, కల్పన, జయమ్మ, లావణ్య, రజిత, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే

రెవెన్యూ సదస్సులు

శామీర్‌పేట, మే 30 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికే కొత్త భూభారతి రెవెన్యూ చట్టప్రకారం ప్రభుత్వం త్వరలో రెవెన్యూ సదస్సులను నిర్వయించనున్నట్లు తహసీల్దార్ యాదగిరిరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 3వ తేదీన ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4గంటల వరకు మండలంలోని పోతాయిపల్లి, యాడారం గ్రామాల్లో ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ చట్టం ప్రకారం రెవెన్యూ సదస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 4న మందాయిపల్లి, అంతాయిపల్లి, 5న పొన్నాల్, లాల్‌గడి మలక్‌పేట గ్రామాల్లో, 6న బొమ్మరాశిపేట, తుర్కపల్లి, 9న శామీర్‌పేట, అలియాబాద్ గ్రామాల్లో, 10న శామీర్‌పేట, మురహరిపల్లి గ్రామాల్లో, 11న తూంకుంట, మజీద్‌పూర్ గ్రామాల్లో, 12, 13న దేవరయాంజాల్, సింగాయిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వివరించారు.

ఎకరాకు రూ.50 లక్షలు చెల్లిస్తేనే భూమిలిస్తాం

● తేల్చిచెప్పిన పోలెపల్లి రైతులు ● డీ-82 కాల్వ భూసేకరణకు అభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ లలిత

ఆమనగల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): ఎకరాకు రూ.50 లక్షల పరిహారం అందిస్తే తప్ప కాల్వల నిర్మాణానికి భూములు ఇవ్వమని పోలెపల్లి రైతులు అధికారులకు తేల్చి చెప్పారు. మార్కెట్‌లో ఎకరాకు రూ.కోటి ధర పలుకుతుందని.. తమకు న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ-82 ప్రధాన కాల్వకు అనుసంధానంగా నిర్మించే చిన్న కాల్వల నిర్మాణానికి భూసేకరణ నిమిత్తం శుక్రవారం ఆమనగల్లు మండలం పోలెపల్లి రైతు వేదికలో గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ లలిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాల్వల నిర్మాణానికి భూములు తీసుకునే రైతులతో అధికారులు అభిప్రాయ సేకరణ, అభ్యంతరాలు స్వీకరించారు. ఈమేరకు రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తహసీల్దార్ లలిత తెలిపారు. డీటీ సంపత్, ఎస్సై వెంకటేశ్, మాజీ సర్పంచ్ బాల్‌రామ్, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్‌లో డాక్టర్లు.. డిప్రెషన్‌లో రోగులు

కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్యుల కొరత

» 45 పోస్టులకు గాను 24 మందే సిబ్బంది

» సగానికి పడిపోయిన కాన్పులు!

» ఆరుగురు గైనకాలజిస్టులకు అందుబాటులో ఇద్దరే.. అందులో నేడు ఒకరు ఉద్యోగ విరమణ

» డిప్యూటేషన్‌లో 8మంది వైద్య నిపుణులు

» తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఆస్పత్రి సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, మే 30(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతుంటే ఉన్న వైద్యులూ ఇక్కడ పనిచేయడం ఇష్టంలేక తమకు నచ్చిన ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దాంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వివిధ విభాగాలకు సంబంధించిన వైద్యులు డిప్యూటేషన్లపై వెళ్లడం వల్ల పేదలు వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఒక పక్క 50 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా ఉన్నతీకరించినా రోగులకు మాత్రం సరైన వైద్యం అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సర్కారు ఆస్పత్రుల్లో ఉన్న వైద్యుల కొరతను దృష్టిలో పెట్టుకొని కొంతమంది వైద్యులు తమ నివాస ప్రాంతాలకు దగ్గరలో ఉన్న ఆస్పత్రులకు డిప్యూటేషన్ కోసం దరఖాస్తు పెట్టుకున్నారని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలాగోలా వైద్యులను నియమించాలన్న ఉద్దేశంతో వైద్య ఆరోగ్యశాఖ వైద్యులు పెట్టుకున్న డిప్యూటేషన్లకు అంగీకారం తెలిపినట్లు సమాచారం.

సగానికి పైగా తగ్గిన కాన్పులు!

షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో గైనకాలజిస్టుల కొరత వల్ల కాన్పుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గత రెండు నెలల క్రితం వరకు నెలకు 100 కాన్పులు జరిగితే.. ప్రస్తుతం ఆ సంఖ్య 45కు చేరుకుంది. కమ్యూనిటీ ఆస్పత్రికి ఆరుగురు గైనకాలజిస్టులను కేటాయిస్తే.. నలుగురు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇందులో డాక్టర్ మాధవిలత కొండాపూర్‌కు, డాక్టర్ సౌమ్యశ్రీ (కాంట్రాక్టు) మహేశ్వరం, డాక్టర్ హసీమ్ జహాన్ హైకోర్టులోని ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. మరో గైనాకాలజిస్టు డాక్టర్ సమీనబేగం(హజ్ మక్కా)లో రెండు నెలల పాటు సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే డిప్యూటేషన్ పంపించింది. జూన్ నెలాఖరు వరకు తిరిగి రానున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇద్దరు గైనకాలజిస్టుల్లో ర్యూన్సీ నేడు(శనివారం) ఉద్యోగ విరమణ చేయడనుండటంతో ఇక ఆస్పత్రిలో ఒక్క గైనకాలజిస్టు మాత్రమే అందుబాటులో ఉండనుంది. అలాగే డెర్మటాలజిస్టు శిఖాసింగ్ వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి, పాల్మనాలజిస్టు డాక్టర్ శివరాహుల్ (కాంట్రాక్టు) కొండాపూర్, డిప్యూటీ జనరల్ మెడికల్ ఆఫీసర్ రాధిక ఇబ్రహీంపట్నం, ఐ స్పెషలిస్టు పద్మలత శంషాబాద్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఇక్కడ ఆస్పపతిలో వైద్యులు కొరత ఏర్పడి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డిప్యూటేషన్ల రద్దుకు చర్యలు

షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్యులు డిప్యూటేషన్ వెళ్లడంపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎవరిని అడిగి డిప్యూటేషన్లు ఇచ్చారని, ఎన్నాళ్ల నుంచి ఈ దందా జరుగుతుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్ అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సకల వసతులు కల్పిస్తుంటే వైద్యులు అందుబాటులో లేకపోవడం సమంజసం కాదన్నారు. ఎవరిని అడిగి డిప్యూటేషన్లు చేశారని మండిపడ్డారు. డిప్యూటేషన్లను రద్దుకు చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

డిప్యూటేషన్‌లో స్పెషలిస్టులు

వివిధ రోగాలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యం అందించేందుకు ప్రభుత్వం కమ్యూనిటీ ఆస్పత్రికి వ్యాధులకు సంబంధించిన వైద్యులను నియమించింది. ఇందులో ఊపిరితిత్తులు, చర్మవ్యాధి నిపుణులు, ఐ స్పెషలిస్టు, డెర్మటాలజిస్టు, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లను కేటాయించింది. కానీ, వీరంతా డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లడం వల్ల రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ సంబంధిత సిబ్బందిని మాత్రం నియమించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న బాల్‌రాజ్

పనికి తగిన వేతనం ఇవ్వాలి

కందుకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, వారికి పనికి తగిన వేతనం ఇవ్వాలని, ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆరోపించారు. శుక్రవారం నేదునూరు సెక్టార్‌లోని అంగన్‌వాడీ టీచర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమస్యల పరిష్కారంతో పాటు కనీస వేతన చట్టాలను అమలు చేయాలంటూ జూన్ 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెలో భాగంగా 39 జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు అన్నిరంగాల కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. టీచర్లు సరస్వతి, వనజ, షాజహాన్, అనిత, సరస్వతి, కవిత, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌తో చర్చిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సౌకర్యవంతంగా నూతన మున్సిపల్ కార్యాలయం

ఘట్‌కేసర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయాన్ని ఎంపీడీవో కార్యాలయానికి తరలించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అక్కడ సౌకర్యవంతంగా ఉందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని అన్నారు. ఘట్‌కేసర్ నూతన మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆమె కాంగ్రెస్ నాయకులతో కలిసి కమిషనర్ భాస్కర్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఘట్‌కేసర్‌లోని పాత మున్సిపల్ కార్యాలయం ఇరుకుగా ఉండటంతో అనేక రకాలు ఇబ్బందులు ఉండేవని గుర్తుచేశారు. ఎట్టకేలకు మున్సిపల్ కార్యాలయం విశాలమైన భవనంలోకి మారడం వలన అధికారులకు, ఉద్యోగులకు, ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, దేవేందర్, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, అంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న రమేశ్

సీపీఐకి అండగా 'జన సేవాదళ్'

చేవెళ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : సీపీఐకి అండగా ఉండేందుకు జన సేవాదళ్ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేశ్ తెలిపారు. జన సేవాదళ్ శిక్షణలో భాగంగా శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సత్యసాయి పాఠశాలలో కొనసాగుతున్న శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువకులు, విద్యార్థులు, మహిళలకు శిక్షణ ఇస్తున్నామని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయటానికి కృషి చేయాలని, గూండాయిజం, రౌడీయిజం, అమ్మాయిలను వేధింపులకు గురిచేసే అల్లరిమూకలను నిర్మూలించేందుకు జన సేవదళ్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. దోపిడీకి పాల్పడుతున్న ప్రభుత్వాల తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సభ్యులు, చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కె.రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, నాయకులు మురళీమోహన్, సుధాకర్‌గౌడ్, కృష్ణగౌడ్, మక్బూల్, కరుణకుమార్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిగి వ్యవసాయ మార్కెట్‌లో మరమ్మతులు

త్వరలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు

» ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి



పరిగి మార్కెట్‌లో గుంతల్లో మట్టి వేయించి చదును చేయిస్తున్న ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరిగి, మే 30 (ఆంధ్రజ్యోతి): 'పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డు బురదమయం.. పట్టించుకోని అధికారులు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 21న ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి మార్కెట్ యార్డు పరిసరాలను పరిశీలించారు. వెంటనే టిప్పర్లతో మట్టిని తెప్పించారు. నీళ్లు నిలుస్తున్న ప్రాంతాల్లో మట్టిని వేసి జేసీబీతో లెవలింగ్ చేయించారు. వర్షపు నీరు నిలవకుండా పనులు చేపట్టామని, ఇది తాత్కాలికమని తెలిపారు. త్వరలో సీసీబెడ్, ప్లాట్‌ఫాంలను నిర్మిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేతో కలిసి వ్యవసాయ మంత్రి తుమ్మల కలిశామని త్వరలో రూ.3కోట్ల నిధులు రానున్నాయని చెప్పారు. కొత్తగా మార్కెట్ కార్యాలయం, విశ్రాంతి భవనం, వాటర్ ప్లాంట్ తదితరులు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విజయకిషోర్, వ్యాపారులు వీరేశం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో ఆక్రమణల తొలగింపు



జేసీబీతో అక్రమాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తాండూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం ఇందిరాచౌక్ నుంచి బస్టాండ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు ఉన్న ఆక్రమణలను పోలీస్‌ల సహకారంతో మున్సిపల్ సిబ్బంది తొలగించారు. శుక్రవారం తాండూరు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పోలీస్‌లతో కలిసి దుకాణాల ఎదుట అక్రమంగా నిర్మించిన కట్టడాలు, పైభాగంలో వేసుకున్న షెడ్లను జేసీబీతో తొలగించారు. కొంత మంది వ్యాపారులు స్వచ్ఛందంగా షెడ్లను తొలగించుకున్నారు. దీనిపై వ్యాపారుల్లో వ్యతిరేకత కనిపించింది. తాండూరు పట్టణం మీదుగా జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులకు అడ్డంకిగా ఉన్నాయని పేర్కొంటూ నిర్మాణాలను తొలగించారు. సైడ్ డ్రైన్ నిర్మించిన తర్వాత చాలా మంది దుకాణాదారులు షెడ్లు, చిన్నచిన్న నిర్మాణాలను ఏర్పాటు చేసుకున్నారు. రోడ్డు వెడల్పు తగ్గిందని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు అవుతున్నాయని తొలగించారు. అయితే అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగించడం ఏంటని పలువురు వ్యాపారులు ప్రశ్నించారు. ఆక్రమణల కూల్చివేతలతో కొద్దిసేపు మున్సిపల్ సిబ్బందితో కొందరు వ్యాపారులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు, అధికారులు నచ్చచెప్పి సముదాయించారు. కార్యక్రమంలో మున్సిపల్ జవాన్లు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

» బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్ పటేల్

యాలాల, మే 30 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్ పటేల్ విమర్శించారు. మండలంలోని జుంటుపల్లి వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ.. యాసంగిలో వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా, ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అరకొర కొనుగోలు కేంద్రాలు సక్రమంగా కొనసాగడం లేదని తప్పుబట్టారు. వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అధికారులు ఎప్పుడు వస్తారో తెలియదు, ఎప్పుడు ధాన్యం తరలిస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ వడ్లను సరైన ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



జుంటుపల్లి కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టిన వడ్లను పరిశీలిస్తున్న శుభప్రద్ పటేల్



పనులు ప్రారంభిస్తున్న లావణ్య దేవేందర్‌యాదవ్

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కొత్తూర్, మే 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ తెలిపారు. మున్సిపాలిటీలోని 7,8,9,10వ వార్డుల్లో రూ.20లక్షలతో నిర్మించితలపెట్టిన భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణాల పనులను శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కొత్తూర్ మున్సిపాలిటీలో అంచలంచెలుగా సమస్యలను పరిష్కారిస్తున్నామని చెప్పారు. కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు నర్సింహగౌడ్, జయమ్మ జనార్ధన్‌చారి, సోమ్లనాయక్, మాజీ సర్పంచులు జనిగె జగన్, జె.సుదర్శన్‌గౌడ్, నాయకులు యాదయ్య, గోపాల్‌గౌడ్, జె.శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, వీరమోని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అంబులెన్స్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



షాద్‌నగర్ రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. సుమారు 65 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి గురువారం రాత్రి రాయికల్ బస్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న అంబులెన్స్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు షాద్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు

తిమ్మాపూర్‌లో పట్టపగలు చోరీ

రూ.15 లక్షలు అపహరణ

కొత్తూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌కు చెందిన శివశంకర్‌గౌడ్ ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని దొంగలు చొరబడి రూ.15లక్షలు ఎత్తుకెళ్లినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. శివశంకర్‌గౌడ్ కుటుంబసభ్యులు ఇటీవల బంధువుల ఇంటికి వెళ్లారని, ఇంటి తాళం వేసి బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చేసరికి గుర్తు తెలియని దొంగలు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి, బీరువాను బద్దలు కొట్టి అందులో ఉన్న రూ.15లక్షలు దోచుకుని పోయారని చెప్పారు. సంఘటన స్థలాన్ని ఇన్‌స్పెక్టర్‌తో పాటు క్లూస్ టీం పరిశీలించింది. శివశంకర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కేశంపేట/చౌదరిగూడ, మే 30(ఆంధ్రజోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే నాణ్యమైన విద్య అందిస్తామని ఉపాధ్యాయులు కోరారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో గ్రామస్థులతో కలిసి శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అరుణ కుమారి, రుద్రమదేవి, మాధవి, రజిత, ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ చంద్రమ్మ, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ బడుల్లోనే అనుభవమైన ఉపాధ్యాయులు ఉంటారని, నాణ్యమైన విద్య అందుతుందని హెచ్‌ఎం లీలామోహన్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివలింగమ్మ, మహేష్, మాలతి, హరిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఏరువాక సాగారో..

(మూడో పేజీ తరువాయి)

అధికంగా కురిసింది. గండిపేట్, బాలానగర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కేశంపేట, కడ్తాల్, మహేశ్వరం, శంషాబాద్, చేవెళ్ల మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మిగితా మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ..

ఈ ఏడాది వానలు ముందస్తుగానే కురుస్తున్నాయి. కొన్నిచోట్ల యాసంగిలో పండించిన ధాన్యం అమ్మకాలు ఇంకా కొనసాగుతున్నాయి. సకాలంలో కాంటా కాకపోడంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం బస్తాలు మూలుగున్నాయి. వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయి రైతులు ఇబ్బంది పడుతున్నారు. అయితే, ధాన్యం అమ్ముకున్న రైతులు వానాకాలం పంటల సాగుపై దృష్టి సారించారు. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనుల్లో బిజీగా మారిపోయారు. దుక్కులు దున్నడం, పొలాల్లో సేంద్రియ ఎరువు(పెంట) చల్లుకోవడం, విత్తనాలు సేకరించుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరికొన్ని



ప్రాంతాల్లో అయితే, అన్నదాతలు అప్పుడే విత్తనాలు నాటడం మొదలు పెట్టారు.

వరిపైనే రైతుల ఆసక్తి..

జిల్లాలో 3.47 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈసారి రైతులతో ఎక్కువగా వరి వేయించాలని నిర్ణయించింది. గతంలో కంటే పత్తి సాగును తగ్గించింది. సన్నాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుండటంతో అన్నదాతలు వరి వైపే మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది 1,00,608 ఎకరాల్లో వరి సాగు చేయాలని నిర్ణయించగా, ఈ ఏడాది దీన్ని 1,40,238 ఎకరాలకు పెంచారు. గత ఏడాది అత్యధికంగా 1,77,735 ఎకరాల్లో పత్తి సాగు చేయాలని నిర్ణయించగా, ఈసారి 1,29,088 ఎకరాలకు పరిమితం చేశారు. వానాకాలం సీజన్ కోసం 13,917 క్వింటాళ్ల విత్తనాలు, 72,200 టన్నుల ఎరువులను సిద్ధం చేశారు.

చేవెళ్ల డివిజన్‌లో..

చేవెళ్ల : పత్తి 62,440 ప్యాకెట్లు, కందులు 208 క్వింటాళ్లు, మొక్కజొన్న 268 క్వింటాళ్లు, వరి 2038 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంది. ఈమేరకు పంపిణీ చేసేందుకు కార్యాచరణ రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందించారు.

అవసరమయ్యే ఎరువులు..

చేవెళ్ల మండలంలో యూరియా 2,060 కింటాళ్లు, డీఏపీ 1,144, 20.20., 013 రకం 1,444, 28, 28, 0 1444, ఎంవోపీ 1,444, మొయినాబాద్ మండలంలో యూరియా 1,358, డీఏపీ 754, 20.20.0.. 754 కింటాళ్లు, 20.20.13.. 754, ఎంవోపీ 754 కింటాళ్లు అవసరమున్నాయి. షాబాద్ మండలంలో యూరియా 2,743, డీఏపీ 1,524, 20.20.13.. 1524 క్వింటాళ్లు, 28.28.0.. 1524, ఎంవోపీ 1524 క్వింటాళ్లు అవసరమున్నాయి. శంకర్‌పల్లి మండలంలో యూరియా 1,275 క్వింటాళ్లు, డీఏపీ 708, 20.20.0.. 708 క్వింటాళ్లు, 28.28.0.. 708, ఎంవోపీ 708 క్వింటాళ్లు అవసరం ఉంటుందని డివిజన్ వ్యవసాయ అధికారులు ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక పంపించారు.



ఇళ్లు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరుతున్న సిక్కులు

రోడ్డుపై ఉంటున్నాం.. 'డబుల్' ఇళ్లు ఇచ్చి ఆదుకోండి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సిక్కుల వినతి

షాద్‌నగర్ అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని కేశంపేట రోడ్డుపై జీవనం గడుపుతున్న తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సిక్కులు కోరారు. కేశంపేట రోడ్డుకిరువైపులా చిన్న చిన్న గుడిసెలు వేసుకొని ఇనుప సామాన్లు, సామగ్రి తయారు చేసుకొని జీవనం గడుపుతున్న సిక్కులు శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు నడికూడ యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 40 సంవత్సరాల క్రితం సంచార జాతులుగా వచ్చి, షాద్‌నగర్ పట్టణంలోని కేశంపేట రోడ్డుకిరువైపులా గుడిసెలు వేసుకొని జీవనం గడుపుతున్నామని వారు తెలిపారు. ప్రభుత్వాలు.. పాలకులు మారినా.. తమకు ఇంటి స్థలాలుగానీ, ఇళ్లుగానీ మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అతి పేదరికంతో రోడ్డుపై బతుకుతున్న తమ దీన స్థితిని చూసైనా సరే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కాగా, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మరమ్మతులు చేసి, పేదలకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, అర్హులందరికీ తప్పక ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారికి హామీ ఇచ్చారు.

పొలాలకు వెళ్లేందుకు దారివ్వాలి : రైతులు



పులిమామిడిలోని నలంద వెంచర్‌ను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతున్న ఎంపీవో గీత

కందుకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలని రైతులు కోరారు. మండలంలోని పులిమామిడి గ్రామ పంచాయతీలో నలంద గార్డెన్స్ అండ్ రిసార్ట్స్ పక్కన ఉన్న రోడ్డును రైతులు పొలాల్లోకి వెళ్లడానికి సౌకర్యం కల్పించాలంటూ గ్రామస్తులు విన్నవించడంతో శుక్రవారం ఎంపీవో గీత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పులిమామిడి రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 138/ఈ, 139లలో ఉన్న భూములకు చుట్టూ నలంద గార్డెన్స్ అండ్ రిసార్ట్స్ పేరుతో కంచె ఏర్పాటు చేస్తున్నట్లు రైతులు వాపోయారు. వెంచర్ వెనుక బంధులో తమ భూములు, పొలాలు ఉన్నాయని, అక్కడికి ఎలా వెళ్లాలని రైతులు ఎంపీవో గీతకు విన్నవించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించి న్యాయం చేస్తానని ఎంపీవో గీత తెలిపారు. రైతులు, నాయకులు సీహెచ్ రమేష్, శ్రీను, భిక్షపతి, వెంకటేష్, కె.అంజనేయులు, జె.రాజు, జె.జంగయ్య, షైనయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

శంషాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఏడీపై స్కూల్లో ఐదు రోజులుగా కొనసాగుతున్న కెపాసిటీ బిల్డింగ్ ఫర్ హైస్కూల్ మ్యాథమేటిక్స్ అండ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ కార్యక్రమం శుక్రవారం రాత్రి ముగిసింది. ఈమేరకు పాఠశాల విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారికి ఆకర్షితులు కాకుండా ఉండేందుకు హిందీ పండిట్లకు శంషాబాద్‌లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. వారికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా ఉత్సాహం ప్రదర్శించిన 14 మందిని సన్మానించారు. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్, ఎంఈవో శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులందరూ తమ తమ పాఠశాలల్లో చదివే విద్యార్థులు డ్రగ్స్ వైపు ఆకర్షితులు కాకుండా చూడాలని, మహమ్మారిని రూపుమాపేందుకు సహాయపడాలన్నారు.

సంపదను పెంచి ప్రజలకు పంచడమే ధ్యేయం

కడ్తాల్, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్ది ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, సంపదను పెంచి ప్రజలకు పంచడమే లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణ పథకాలు దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తాయన్నారు. కడ్తాల మండలం గొర్లకుంట తండాలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించారు. అనంతరం డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా



కడ్తాల్ : ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



కందుకూరు : పెద్దమ్మ తండాలో భూమి చేసిన కృష్ణానాయక్, జంగారెడ్డి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమనాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అర్హులందరికీ ఇల్లు మంజూరవుతుందని, ఎవరూ ఆందోళన చెందరాదని ఎమ్మెల్యే చెప్పారు. నాయకులు నరేశ్‌నాయక్, మల్లేశ్‌గౌడ్, సత్యం యాదవ్, ప్రభు, చందోజీ, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, కృష్ణ, జహంగీర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు మున్సిపల్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, ఎన్‌ఎస్‌ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫరీద్ లు చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు ఆదర్శనగర్ కాలనీలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి భూమి పూజ చేశారు.

కందుకూరు : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్నట్లు మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు తెలిపారు. పెద్దమ్మతండా, బంజరుగడ్డ తండా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసి భూమిపూజ చేశారు. నాయకులు సంతోష్, బుక్క పాండురంగా రెడ్డి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

యాచారం : మండలంలోని యాచారం, గున్‌గల్, మాల్, నందివనపర్తి, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఆయా గ్రామాల్లో ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ, ఎంపీవో శ్రీలతలు పర్యటించి భూమి పూజ చేసిన లబ్ధిదారుల వివరాలపై ఆరా తీశారు. 30 ఇండ్ల వరకు భూమి పూజ చేశారని, ఇంటి నిర్మాణ పనులు ముమ్మరం చేయాలని ఈ సందర్భంగా వారు ప్రజలకు సూచించారు.

ఈజీఎస్‌లో ఏడాదికి 200 రోజులు పని కల్పించాలి

(మూడో పేజీ తరువాయి)

ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు, కాడిగళ్ల భాస్కర్, దుబ్బాక రాంచందర్, బోడ సామేలు, మట్టివాడ చంద్రమోహన్, దయ్యాల దగదీస్, ఏర్పుల నర్సింహ, గుగులోత్ కవిత, ఆలంపల్లి నర్సింహ, రావుల జంగయ్య, చెరువెంక బుగ్గ రాములు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రైతులకు పరిహారం చెల్లించాలి

ఫార్మాసిటీ రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో సంగీతకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు 121 చరపు గజాల ఇంటి స్థలం సర్టిఫికెట్ ఇచ్చారు.. కానీ.. రైతులకు నష్టపరిహారం ఇవ్వడం లేదని తెలిపారు. తాడిపర్తి, కుర్మిద్ద, నజ్దిక్ సింగారం, నందివనపర్తి గ్రామాల్లో రైతులకు పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుప్పహాడ్ గ్రామంలోని 97 ఎకరాల 20 గుంటల మినామి భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. 2007 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి సర్వేనెంబర్ 189, 203లో 675 మంది పేదలకు 60 గజాల చొప్పున ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చిన వారికి వెంటనే పొజిషన్ చూపించాలన్నారు. హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ సర్వేనెంబర్ 171లో 70 ఎకరాల భూమిలో అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, అబ్దులాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ఏరియాలలో ప్రభుత్వ భూములు కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్ద మంగళారంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు పట్టాలు ఇచ్చిన వారికి వెంటనే ఇంటిలోకి పంపించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వెంకట్‌రాములు, అంజయ్య, జగన్, జంగయ్య, శ్యాంసుందర్, కుమార్, శ్రీను నాయక్, గణేష్, జంగయ్య, పుష్ప, సయ్యద్‌పాష, సైదమ్మ, మల్లేష్, రమేష్, ఎ. నర్సింహా పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో గ్రూపుల్లేవ్..

(మూడో పేజీ తరువాయి)

పదవులకు అవకాశం లభిస్తుందన్నారు. మల్లురవి, వంశీ చంద్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి చుట్టూ తిరిగినంత మాత్రాన పార్టీ పదవులు వస్తాయనుకున్న ఆలోచన పార్టీ నేతలు వీడాలన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీచంద్‌రెడ్డి మధ్య గ్రూపు తగాదాలు ఉన్నాయని కథనాలు వెలువరిస్తున్న వారికి జర్నలిజంలో ఉండే అర్హత లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అద్భుత విజయాలు సాధించడం జరిగిందన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో తెలంగాణ దేశానికి రోల్ మాడల్‌గా నిలిచిందన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎన్నికల పరిశీలకుడు ధారాసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ హక్కులను కాలరాస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రాష్ట్రంలో విపక్షాలు ఉనికి లేకుండా పోతాయన్నారు.

సమావేశంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు బట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు భాస్కర్‌రెడ్డి, బ్యాంగి ఆనంద్ కుమార్, యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, హనుమాన్‌నాయక్, బిక్యానాయక్, విజయ్‌కుమార్‌రెడ్డి, జగన్, బిచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, మానయ్య, శ్రీకాంత్‌రెడ్డి, మోతిలాల్‌నాయక్, హనుమానాయక్, గుర్రం కేశవులు, ఇమ్రాన్‌బాబా, చేగురి వెంకటేశ్, సాయిరెడ్డి, నిట్ట నారాయణ, కృష్ణనాయక్, లక్ష్మణ్, జహంగీర్‌బాబా, షాబుద్దీన్, రామకృష్ణ, చందోజీ, కృష్ణనాయక్, శేఖర్‌గౌడ్, దశరథం, మోహన్‌రెడ్డి, అంజయ్య, కాసు శ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి, జంగారెడ్డి, శేఖర్‌గౌడ్, విజయ్‌నాయక్, ఫరీద్, ఖాదర్, లక్ష్మణ్, వేణుగోపాల్, కృష్ణ, శ్రీకాంత్, రవి, రాజేందర్, అజీమ్, సత్యం, అశోక్, నరేందర్, నరేశ్‌నాయక్, శ్రీశైలం, మల్లేశ్‌గౌడ్, రాములు, పర్వతాలు, వెంకట్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, అనంతరెడ్డి, యాదయ్య, లక్ప్తినాయక్ పాల్గొన్నారు.



ఫెస్టివల్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

శంకర్‌పల్లిలో హర్ష టయోటా ఫెస్టివల్ కౌంటర్ ఏర్పాటు

శంకర్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో హర్ష టయోటా ఫెస్టివల్ కౌంటర్ ఏర్పాటైంది. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్, ఎంపీడీవో వెంకయ్యల చేతుల మీదుగా శంకర్‌పల్లిలో నూతనంగా ఏర్పాటుచేసిన హర్ష టయోటా ఫెస్టివల్ కౌంటర్‌ను అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హర్ష టయోటా ఫెస్టివల్ కౌంటర్‌ను శంకర్‌పల్లి పట్టణంలో అందుబాటులోకి తీసుకురావడంతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హర్ష టయోటా కంపెనీ నిర్వాహకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థికసాయం

శంషాబాద్ రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నర్కూడలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం మల్కారం పీఎస్‌సీఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్ శుక్రవారం సీఐ నరేందర్‌రెడ్డికి రూ.25వేలు అందజేశారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తున్న నాయకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

హామీలు తక్షణమే నెరవేర్చాలి

షాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలకు తక్షణమే నెరవేర్చాలని బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ లంబడి రాము డిమాండ్ చేశాడు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యమకారులకు పింఛన్‌తో పాటు 250 గజాల ఇంటి స్థలం, ఇవ్వాలని, ఉద్యమకారులకు గుర్తించడానికి కమిటీ ఏర్పా టు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో ఉద్యమకారులకు 10శాతం కేటాయించాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.



యాచారం : రైతులకు సూచనలిస్తున్న డాక్టర్ కవిత

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

మంచాల, మే 30(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ ఆధారిత సాగు అన్నదాతలకు లాభసాటిగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్త డా.చంద్రకాంత్ సూచించారు. క్రీడా మరియు కృషి విజ్ఞాన కేంద్రంనకు చెందిన శాస్త్రవేత్తల బృందం శుక్రవారం మండల పరిధిలోని చిత్తాపూర్, పీసీ తండాలను సందర్శించింది. వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.చంద్రకాంత్, గౌతమ్ వీర్ చౌహాన్, పి.రామకృష్ణలు మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో పప్పుధాన్యాల సాగుకు మద్దతుగా రెడ్‌గ్రాం విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పప్పుధాన్యాల సాగుతో నేల ప్రాముఖ్యత పెరుగుతుందన్నారు. క్లస్టర్ సాగుతో వనరులు, మార్కెటింగ్ సదుపాయాలు మెరుగవుతాయన్నారు. ఎం.కృష్ణ, జి.చెన్నయ్య పాల్గొన్నారు.

యాచారం : అతిగా రసాయన ఎరువులు వాడొద్దని, నేలతల్లి ఆరోగ్యంతో పాటు నీటిని పొదుపుగా వాడితే మంచి ఫలితముంటుందని శాస్త్రవేత్త డాక్టర్ కవిత రైతులను కోరారు. చౌదర్‌పల్లి రైతు వేదికలో నీటిని పొదుపుగా వాడి సాగు చేయడంపై రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.



మంచాల : చిత్తాపూర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వ్యవసాయాధికారులు రైతులు

డాక్టర్ జెమీమా, వ్యవసాయాధికారి రవినాథ్, ఏఈవోలు సంతోష్‌కుమార్, వసంత, రాధమ్మ, రమేష్ ఉన్నారు. అనంతరం చౌదర్‌పల్లిలో వంగ, బెండ సాగును పరిశీలించారు.

షాబాద్ : రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం, వ్యవసాయ శాస్త్రవేత్తలు డి.శ్రీనివాస్‌రెడ్డి, పి.సతీష్, శిరీష, అర్చన సూచించారు. పెదవేడు, మక్తగూడ గ్రామాల్లో నిర్వహించారు. పంటల సాగులో మెళకువలు నూతన వంగడాలు, తదితర విషయాలపై రైతులకు క్లుప్తంగా వివరించారు. ఏవో వెంకటేశం, ఏఈవోలు గీత, రాజేశ్వరి, కిరణ్మయి రైతులు పాల్గొన్నారు.

మాడ్గుల : కృషి విజ్ఞాన కేంద్రం, సేంద్రియ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రై తు వేదికలో డాక్టర్ ఆర్ నాగార్జున కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ భార్గవి, అధికారులు పాల్గొన్నారు.

కడ్తాల్ : నేల స్వభావాన్ని బట్టి రైతులు పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు సూచించారు. రావిచెడ్ రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఏవో శ్రీలత అధ్యక్షతన కార్యక్రమానికి శాస్త్రవేత్తలు డాక్టర్ నాగార్జునకుమార్, భార్గవి, ప్రియ, సుధీర్, విజయ్‌కుమార్, దిలీప్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏఈవోలు శ్రీకాంత్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ : పెదవేడులో మాట్లాడుతున్న బలరాం

తెలంగాణ తల్లి, అమరవీరుల స్థూపాల ఏర్పాటుకు స్థలం చూపండి

షాద్‌నగర్ అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఆవరణలో తెలంగాణ తల్లి, అమరవీరుల స్థూపాన్ని నిర్మించడానికి స్థలాన్ని చూపాలని ఎంపీడీవో బన్సీలాల్‌ను ఉద్యమకారులు కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి షాద్‌నగర్ అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవోను కలిసి లిఖితపూర్వకంగా వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం సభ్యులు పి.ప్రభాకర్‌రావు, ఎ.శ్రీనివాస్ రెడ్డి, జి.సుధాకర్, రవికుమార్‌గౌడ్, జాంగారి నర్సింహులు, రవి, బాలు నాయక్, కుడుముల మల్లేష్, ఎల్లోజీ, కోమరేష్, అల్లాడ శేఖర్, రవిశంకర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

కె. రవీందర్ తండ్రి కె. సోమా, నివాసత నం.2-20, ఎల్లమ్మ తండా, మాంచాల్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ వాసియైన నేను ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నేను ఇబ్రహీంపట్నం నుండి హైదరాబాద్‌కు ప్రయాణించే సమయంలో సర్వే నం.242లోని ఎకరాలు 3.10 గుంటల విస్తీర్ణం గల వ్యవసాయ భూమికి సంబంధించిన నం.1473/1998 కలిగిన నా ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి. ఎవరికైనా దొరికితే ఫోన్: 9000528010 కు తెలియజేయగలరని మనవి.

PUBLIC NOTICE

The General Public is hereby inform that Smt. **TEKULAPALLY SHIVALEELA**, AGE 40YEARS, OCCUPATION :HOUSE WIFE, R/O **H.No.1-81, MUNIDEVUNIPALLY VILLAGE, KONDAPUR MANDAL, SANGAREDDY Dist-502295, TELANGANA STATE, My Client M/s SHRIRAM FINANCE LTD.** CHEVELLA Branch, Ranga Reddy Dist with a Requesting to advance of Loan by Mortgaging his Property.

DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that the Non-Agricultural Land open place bearing survey No.59/a(Online Bhubharati Portal Survey No.59/a/2), admeasuring Ac.0-06 Guntas or 726.00 sq. yards., or 607.00 sq.meters situated at MUNIDEVUNIPALLY Village & G.P. KONDAPUR Mandal, SANGAREDDY Dist, Telangana State and bounded as follows:- **NORTH: LAND OF TEKULAPALLY KISTAMMA. SOUTH: LAND OF TEKULAPALLY MALLESHAM. EAST: ROAD. WEST: LAND OF TEKULAPALLY VENKATESHAM GOUD.** Institution if having objections, Claims interest disputed for the .above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date of publication please take notice that if no objection claims are received within period prescribed above. My client will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

Sd/-**ARVIND KULKARNI,** Advocate, SANGAREDDY

ఆడబిడ్డ పెళ్లికి ఆర్థికసాయం

కడ్తాల్, మే 30(ఆంధజ్యోతి): పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కడ్తాల మాజీ జడ్పీటీసీ, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ నాయక్ చేయూతనందించారు. శుక్రవారం కడ్తాల మండల కేంద్రానికి చెందిన మేస్త్రీ సంఘం అధ్యక్షుడు బాల్‌రాజ్ కూతురు కల్పన వివాహం జరిగింది. జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్‌ద్వారా రూ.21వేలు, పట్టు చీర బహూకరించారు. కడ్తాల మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5వేల ఆర్థిక సాయం అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిచంద్ నాయక్, లాయక్‌అలీ, మంగళపల్లి నర్సింహ, రామచంద్రయ్య, మహేశ్‌కుమార్ గౌడ్, పాండు నాయక్,మహేశ్, అంజి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెలు బహూకరణ


కేశంపేట, మే 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాపిరెడ్డి గూడకు చెందిన దివంగత సూరమోని సత్యయ్య, సువర్ణ దంపతుల కూతురు మౌనిక వివాహం సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారం పుస్తె, మెట్టెలు అందజేసి ఉదారత చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సురమోని శంకర్, నరేందర్‌జీ, చిన్నారెడ్డి, కృష్ణరెడ్డి, కటికె ప్రభాకర్, అబ్బి శ్రీను పాల్గొన్నారు.

కలగానే కా'లేజీ'!

(మూడో పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడితెస్తున్నారు. కాగా మండల కేంద్రం ఏర్పాటైన నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటవుతుందని స్థానికులు ఆశించిన నిరాశే ఎదురైంది. 24 గ్రామ పంచాయతీలు కలిగిన కడ్తాల మండలంలో ఆరు ప్రభుత్వ, నాలుగు ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ప్రతి ఏటా 500 నుంచి 700 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరంతా పదవ తరగతి పాస్ అయ్యాక జూనియర్ కళాశాల అందుబాటులో లేక ఉన్నత విద్య చదువుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విధిలేక ప్రైవేట్ కళాశాలల్లో వేలకు వేలు ఫీజులు చెల్లించి చదివించాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మరికొందరు ప్రైవేట్‌లో ఫీజులు చెల్లించలేక చదువుని మధ్యలోనే ఆపేస్తున్నారు. ప్రభుత్వ కళాశాల ఏర్పాటు విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా కళాశాల ఏర్పాటవుతుందని ఎదురు చూడడం తీరా నిరాశకు లోనుకావడం విద్యార్థులకు పరిపాటిగా మారింది. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు గురించి ఏబీవీపీ, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు పలుమార్లు మంత్రులు, కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందన లేదు. పలుమార్లు ఆందోళనలు సైతం చేపట్టారు. కడ్తాలలో కళాశాల ఏర్పాటు చేస్తే కడ్తాల, తలకొండపల్లి, కందుకూరు మండలాల పరిధిలోని పేద విద్యార్థులకు కూడా సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికైనా కళాశాల ఏర్పాటుకు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

కళాశాల ఏర్పాటుకు కృషి



కడ్తాల మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కళాశాల ఏర్పాటు గురించి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవిల దృష్టికి తీసుకుపోయాం. వారు స్పందించి వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. గత ప్రభుత్వం కళాశాల ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యం చేసింది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా కళాశాల ఏర్పాటయ్యేలా చూస్తాం.

- గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ, కడ్తాల్

వైద్యశిబిరం విజయవంతం

కడ్తాల్, మే30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిచెడ్ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. శిబిరంలో ప్రభాకర్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనివైద్యులు సూచించారు. కార్యక్రమంలో వెంకటక్రాంతి కిరణ్, మెడికల్ క్యాంప్ నిర్వాహకులు వెంకన్న, బొప్పిడి గోపాల్, పుట్టపాక రాంచందర్ రావు, బాలకృష్ణ, రంగయ్య, రవి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.